# మహిళలకు బతుకమ్మ కానుక

## రెండు చొప్పున చీరెలు పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 ,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రేవంతన్న కానుక పేరుతో చేనేత చీరలను పంపిణీ చేయడానికి సిద మైంది. గతంలో చీరల నాణ్యతపై విమర్శలు రావడంతో ఈసారి నాణ్యమైన చీరలను అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు చీరలు ఇవ్వడంతో పాటు.. చేనేత కార్మికులకు ఉపాధి కల్పిం చాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులకు ప్రత్యేక బహుమతి అందించనుంది. రేవంతన్న కానుక పేరిట, ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రతి సభ్యురాలికి రెండు చొప్పున చేనేత చీరలు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకూ బతుకమ్మ చీరలు ఇచ్చింది. కానీ వాటి నాణ్యతపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ పరిస్థితిని గమనించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది చీరల పంపిణీని నిలిపివేసింది. అయితే ఆ నిర్ణయంపై వ్యతిరేకత రావడంతో ఈసారి నాణ్యమైన చీరలను అందించాలని డిసైడ్ అయింది. ఈ పథకం ప్రధాన ఉద్దేశం కేవలం మహిళలకు చీరలు ఇవ్వడమే కాదు, చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కూడా. ఈ చీరలను వరంగల్, కరీంనగర్, సిరిసిల్ల వంటి జిల్లాల్లోని చేనేత కేంద్రాల్లో తయారు చేయించారు. దీని ద్వారా చేనేత కార్మికుల జీవితాలు మెరుగుపడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపిక చేసిన ప్రత్యేక డిజైన్‌లలో ఈ చీరలు తయారయ్యాయి. ఒక్కో చీరె సుమారు రూ.800 విలువ ఉంటుందని అంచనా. గతంలో రేషన్ కార్డుల ఆధారంగా చీరలు పంపిణీ చేయగా.. ఈసారి కేవలం స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే ఈ చీరలను అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మహిళా సంఘాల సభ్యుల సంఖ్యను లెక్కించారు. వీరందరికీ చీరలు పంపిణీ చేయనున్నారు. చీరల పంపిణీ బాధ్యతలను మెప్మా సిబ్బందికి అప్పగించారు. జిల్లా, మండల స్థాయిల్లో నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ నుంచి గ్రామాలకు తరలించి సభ్యులకు అందజేస్తారు. రెండు రకాల సైజుల్లో 6.5 మీటర్లు, 9 మీటర్ల చీరలు అందుబాటులో ఉంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళా సంఘాలకు చీరలు ఇవ్వడం ఇదే మొదటిసారి. చీరల పంపిణీతో మహిళల గౌరవాన్ని పెంచడంతోపాటు, చేనేత రంగానికి చేయూతనిస్తున్నామని పేర్కొంది.




## అరంగేట్రం ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌చరణ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌లో తొలిసారి నిర్వహించనున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)కు గ్లోబల్ ఐకాన్ రామ్‌చరణ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తున్నట్లు జాతీయ ఆర్చరీ అసోసియేషన్(ఏఏఐ) అధ్యక్షుడు అర్జున్ ముండా, ఏఏఐ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర సచ్‌దేవా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా అక్టోబర్ 2నుంచి 12 వరకు అరంగేట్రం ఏపీఎల్ జరుగనుంది. ఫ్రాంఛైజీ ఆధారిత లీగ్‌గా జరుగబోతున్న టోర్నీలో ఆతిథ్య భారత్‌లోని పురుష, మహిళా కాంపౌండ్, రికర్వ్ ఆర్చర్లతో పాటు వివిధ దేశాల ఆర్చర్లను ఒక చోటుకు చేర్చనుంది. దేశీయ ఆర్చరీకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు భారత ఒలింపిక్ మూమెంట్‌ను మరింత ముందుకు తీసుకుపోయే ఉద్దేశంతో లీగ్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. లీగ్‌లో మొత్తం ఆరు ఫ్రాంఛైజీల్లో 36 మంది భారత టాప్ ఆర్చర్లతో సహా 12 మంది అంతర్జాతీయ ఆర్చర్లు పోటీపడనున్నారు. లైట్ల వెలుతురులో గతంలో ఎన్నడూ లేని విధంగా డైనమిక్ ఫార్మాట్ ద్వారా ఆర్చర్లు రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో పోటీపడనున్నారు.

## మారేడ్‌పల్లిలోని ఓ వ్యాపారవేత్త ఇంట్లో ఇడి సోదాలు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లి ఏఓసి సెంటర్ రోడ్డులోని వెల్డింగ్‌టన్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న వ్యాపార వేత్త బూరుగు రమేష్ కుమారుడు, అతని కుమారుడు నివాసాలపై ఈడి అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. వెల్డింగ్ టన్ ఎన్‌క్లేవ్‌లోని ఫ్లాట్ నెం 26లో నివాసం ఉంటున్న రమేష్ ఇంట్లో ఈడి అధికారులు రెండు బృందాలతో ఈడి సోదాలు నిర్వహించారు. కాస్పోలీగల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మహదేవ జ్యూవెల్లర్స్, రాజశ్రీపుడ్స్, వాసవి రియల్ ఎస్టేట్‌లలో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తూ బూరుగు విక్రాంత్ డైరెక్టర్‌గా ఉన్నట్లు తెలిసింది.



## దివంగత పురుషోత్తంరెడ్డికి ఘన నివాళులు

### మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి దివంగత నలమాద పురోషోత్తం రెడ్డి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు పలువురు నివాళులు అర్పించారు. దివంగత నలమాద పురోషోత్తం రెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ జె ఆర్.సి కన్వెన్షన్ లో జరిగిన కార్యాక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, శాసనసభాపతి ప్రసాద్ రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి లతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వివేక్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లతో పాటు సీనియర్ కాంగ్రెస్ నేతలు కుందురు జానా రెడ్డి, టి.జీవన్ రెడ్డి లు హాజరై దివంగత పురుషోత్తం రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. అంతే గాకుండా అధికార పక్ష శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు కార్పొరేషన్ చైర్మన్ లు, పిసిసి కార్యవర్గం ,డి.సి.సి అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో మూడు కిలోలకుపైగా బంగారం పట్టివేత

### విమానాశ్రయంలో డిఆర్ఐ అధికారుల తనిఖీలు

### కువైట్ నుంచి వచ్చిన ముగ్గురు ప్రయాణికుల అరెస్

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** గుట్టుచప్పుడు కాకుండా బంగారాన్ని అక్రమ రవాణా చేస్తూ డిఆర్ఐ అధికారులకు పట్టుపట్ట ఘటన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. డిఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం విదేశాల నుంచి అక్ర మంగా బంగారాన్ని తరలిస్తు న్నారన్న పక్క సమాచారంతో కువైట్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వచ్చిన ప్రయా ణికులను తనిఖీలు నిర్వహిస్తుం డగా కొందరు వ్యక్తులు తమ రెండు లగేజీ బ్యాగులను శంషాబాద్ విమానాశ్రయంలో వదిలి వెళ్లారు. ఆ బ్యాగులను స్కా నింగ్ చేసి తనిఖీలు చేయగా అందులో బంగారం ఉన్నట్లు గుర్తించారు. ఆలగేజీ బ్యాగులో ఒక బ్యాగులో ఐరన్ బాక్స్‌లో బంగారాన్ని దాచి తరలిస్తు న్నట్టు గుర్తించారు. మరో బ్యాగులో బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు లగేజీ బ్యాగుల నుండి 3.36 కోట్ల విలువ చేసే 3 కిలోల 379.600 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. లగేజీ బ్యాగుల ఆధారంగా ఎంక్వయిరీ చేయగా ఈ బంగారాన్ని తరలిస్తున్న వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చెందిన అన్నమయ్య జిల్లాకు, కడప జిల్లాకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. ముగ్గురు నింది తులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఆర్ఐ అధికారులు తెలిపారు.




స్వాధీనం చేసుకున్న బంగారం

# జూరాలకు వెయ్యి టిఎంసిల వరద

**సెప్టెంబర్ మొదటి వారం వరకు శ్రీశైలంలోకి 1133.5 టిఎంసిలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవన కాలంలో కృష్ణా నది గతంలో ఎన్నడూ లేని విధంగా బిరబిర పరుగులెత్తింది. గత సంవత్సరం కృష్ణానదిపై ప్రాజెక్టులు అతికష్టంగా జలకళ సంతరించుకొంటే ఈ వర్షకాలంలో జూన్ నెలలలోనే గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి నెలకొంది. జూరాల ప్రాజెక్టుకు జూన్ మొదటి వారం నుంచి సెప్టెంబరు 17 తేదీ వరకు నీరు వెయ్యి టిఎంసిల వరద వచ్చింది. జూరాలకు గతంలో ఎన్నడూ లేనంతగా 117 రోజుల వ్యవధిలో ఈ స్థాయిలో వరద రావడం దానిని దిగువకు వదలడం జరిగింది. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి 624 టిఎంసిల మేర నీరు రాగా, మిగతా 376 టిఎంసిలు భీమా నదితోపాటు జూరాల ఎగువన పరీవాహక ప్రాంతంలో కురిసిన వానల ద్వారా వచ్చింది. జూరాలలో విద్యుత్ ఉత్పత్తికూడా ఈ సారి రికార్డుస్థాయిలో జరిగింది. దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కూడా ఈ యేడు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు కూడా సుమారు 654టిఎంసిల నీరును పోతిరెడ్డి పాడునుంచి తరలించారు. శ్రీశైల జలాశయానికి జూరాల నుంచి ఈ ఏడాది జూన్ 1 నుంచి, సుంకేసుల నుంచి జులై 5 నుంచి వరద ప్రవాహం ప్రారంభమైంది. సెప్టెంబరు 4నాటికి నాటికి 1133.57 టిఎంసిల వరద నీరు వచ్చి చేరింది.

48 రోజుల పాటు శ్రీశైల జలాశయం గేట్లు ఎత్తారు. ప్రస్తుతం 16వందల టిఎంసిలు ఇతర ప్రాజెక్టులతోపాటు నాగార్జునసాగర్‌కు దిగువకు విడుదల చేశారు. జూరాలలో ప్రస్తుతం 9.65 టిఎంసిల నీరు నిలిచి ఉంది. నాగర్జునసాగర్‌లో 307 టిఎంసిలు నీరు ఉండగా గత యేడాది అందులో 269 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఈయేడు శ్రీశైలంలో 208టిఎంసిల నీరు నిలిచి ఉంది. గత ఏడాది 269 టిఎంసిలు ఇదే రోజున ఉంది. గత యేడాది కృష్ణానది మందగమనంతో ప్రవహిస్తే ఈ యేడాది ఆరంభం నుంచి పరుగులుపెట్టుతూనే ఉంది. మరోవైపు గోదావరి ఆగస్టు రెండోవారం వరకు ఎల్లంపల్లి ఎగువన అతితక్కువ వరద వచ్చింది. ఆగస్టు రెండోవారం నుంచి ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడం మొదలైంది. ఈసారి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి మొత్తానికి ఆలస్యంగా నిండినా మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లకు మిడ్‌మానేరు నుంచి నీటిని తరలించడానికి వీలైంది.

# ఆడంబరాల కన్నా అన్నదాత శ్రేయస్సే మిన్న!

### రైతుల సంక్షేమానికి రూ. 2 కోట్ల విరాళం ఇచ్చిన మిర్యాలగూడ ఎమ్మెల్యే

### ప్రతి రైతుకు ఉచితంగా బస్తా యూరియా

### ముఖ్యమంత్రికి చెక్కు అందజేసిన బిఎల్ఆర్



**మిర్యాలగూడ. సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** మానవసేవే మాధవ సేవగా భావించి పదవులతో సంబంధం లేకుండా తమకున్న సంపదలో పేదలకు ఏదో చేయాలని సంకల్పంతో చేపట్టిన పలు సామాజిక సేవా కార్యక్రమాలు ఆయనను ఉన్నత స్థానంలో నిలిపాయి. అందుకు మెచ్చిన నియోజకవర్గ ప్రజలు ఆయనను తన ప్రతినిధిగా ఎన్నుకొని తమకు కృతజ్ఞతను చాటారు. వారి రుణం తీర్చుకునేందుకు తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాలు పొందిన బిఎల్ఆర్ మరో వినూ త్న భూరి విరాళంతో రైతుల సంక్షేమానికి బాటలు వేశారు. వివరాల్లోకెళ్తే నల్లగొండ జిల్లా మిర్యాల గూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి ( బి ఎల్ ఆర్) తమ సేవా కార్యక్ర మంలో భాగంగా తమ కుమారుడి వివాహ రిసెప్షన్ కొరకు చేస్తున్న ఏర్పాట్లకు బ్రేక్ ఇచ్చి ఆ డబ్బుతో ఆడంబరాలకు పోకుండా రూ 2 కోట్లను చెక్కు రూపంలో గురువారం ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి తమ కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. రైతు బాంధవుడుగా రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా ప్రస్తుతం రైతులు యూరియాకు పడుతున్న ఇబ్బందులు గమనించిన ఆయన తనవంతుగా ప్రతి రైతుకు ఒక యూరియా ప్రస్థానం ఉచితంగా అందించాలనే సంకల్పంతో తమ విరాళాన్ని కుటుంబ సభ్యులైన సతీమణి మాధవి, కుమారులు సాయి ప్రశాంత్, ఈశ్వర్ రెడ్డి. కోడలు వెన్నెలతో కలిసి అందజేశారు. దీనిపట్ల నియోజకవర్గం లోని కాంగ్రెస్ శ్రేణులు రైతులు ఎమ్మెల్యే బిఎల్ఆర్ సేవా నిరతిని కొనియాడారు. నియోజకవర్గంలో రైతులు యూరియా కొరకు పడుతున్న ఇబ్బందులను అదిగమిం చేందుకు స్వయానా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మంలో కలిసి రైతులకు యూరియా కొరతను తీర్చేందుకు విన్నవించినవెంటనే స్పందించిన సంబంధిత మంత్రి అవసరమైన యూరియాను మిర్యాల గూడ నియోజకవర్గానికి అందించే ఏర్పాట్లు చేయడంతో రోజుకు సుమారుగా 1000 మెట్రిక్ టన్నుల యూరి యాను రైతులకు అందించేం దుకు వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా రైతుల సంక్షేమం దృష్ట్యా యూరియా కొరత నివారించేందుకు భారీవిరాళం అందజేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

# టెర్రెస్ గార్డెన్‌లకు ప్రతీ రెండో శనివారం శిక్షణ

### హార్టీకల్చర్ కమిషనర్ యాస్మిన్ బాషా



నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో నర్సరీ మేళాను ప్రారంభిస్తున్న హార్టీకల్చర్ కమిషనర్ యాస్మీన్ బాషా

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** కాంక్రీట్ జంగిల్‌గా మారిన సిటీల్లో టెర్రస్ గార్డెన్‌లను ప్రోత్సహించేందుకు ప్రతీరెండో శనివారం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర హార్టీకల్చర్ కమిషనర్ యాస్మిన్ భాషా అన్నారు. నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో 18వ గ్రాండ్ నర్సరీమేళా పేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టీకల్చర్ షోను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీనరీ ప్రియులకు అందుబాటులో తీసుకు వచ్చేందుకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అరుదైన మొక్కలు, విత్తనాలు తీసుకువచ్చి ఒక వేదికగా నర్సరీ మేళాలో ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. మెడిసినల్ ప్లాంట్స్, కిచెన్, అవుట్‌డోర్, బల్బ్, సీడ్, సీడ్‌లింగ్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్‌తో పాటు ఎగ్జాటిక్ ప్లాంట్స్, వాటర్ లిల్లీస్, కోకో పీట్, గార్డెన్ ఎక్విప్‌మెంట్, ఫామ్ ఎక్విప్‌మెంట్ వంటి వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయన్నారు. మేళా ఇంచార్జ్ ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ ఏపీ, కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, ముంబై, బెంగళూరు, పుణె, షిర్డీ, కడియం, చెన్నై, వెస్ట్ బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మొక్కలతో 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ షోలో టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా సందర్శకులకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వెస్ట్ బెంగాల్‌లోని కాలీపంగ్ నుంచి ప్రత్యేక ఎగ్జాటిక్ ప్లాంట్స్ స్టాల్ కూడా ఆకర్షణగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనలో రూ.30 నుంచి రూ.3 లక్షల వరకు విలువైన మొక్కలు లభ్యమవుతాయని వివరించారు.

# కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులను చర్చలకు పిలవాలి

### శాంతి చర్చల కమిటీ డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం కనీసం వందరోజుల పాటు కాల్పుల విరమణ ప్రకటించి, శాంతి చర్చలకు అనువైన వాతావరణం కల్పించాలని శాంతి చర్చల కమిటీ డిమాండ్ చేసింది. అప్పుడే ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు కాపాడబడుతాయని పేర్కొన్నది. గురువారం హైదరాబాద్ సోమాజి గూడ ప్రెస్ క్లబ్లో శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షులు కందిమల్ల ప్రతాప రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్‌లు మీడియాతో మాట్లా డారు. మనిషి ప్రాణం తీయాలనడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే సాయుధ బలగాలను ఉపసం హరించుకొని, మావోయిస్టులను చర్చలకు పిలువాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల నుంచి చర్చల ప్రతిపాదన వచ్చినప్పుడు కేంద్రం ఆలోచించి, తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. అటు మావోయిస్టులు, ఇటు పోలీసుల మధ్య హింసకు, ప్రాణనష్టానికి దారితీసిప్పుడు పౌర సమాజం నిశ్శబ్దం వీడాలన్నారు. శాంతి చర్చల సందర్భంగా ఆదివాసీలు సమస్యలు ముందుకురావొచ్చు అలాంటప్పుడు కేంద్రం ఒక మెట్టు దిగి శాంతి చర్చలు జరపాలని కోరారు. కొత్త సమాజం కావాలని కోరుకొంటున్నారని, ఇందుకు ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా సంపూర్ణంగా అర్థం చేసుకోవాలని సూచించారు. మావోయిస్టులు ఎవరు కోసం పనిచేస్తున్నారనే విషయాన్ని కేంద్రం ఆలోచించాలన్నారు. ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాల జీవితాలు బాగువడాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలని, ఆకల బాధలు, అవినీతి, కల్తీ పోవాలని కోరుకొంటున్న వ్యక్తులను నేరస్థులుగా చూడటం ఎంతవరకు సమంజసమన్నారు.

రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కూడా చర్చల ద్వారా పరిష్కారమవు తుందని, మావోయిస్టులు చర్చలకు సిద్ధమన్నా స్పందించని కేంద్ర దురుద్దేశం ఏంటో అర్థం చేసుకోవచ్చున్నారు. రాజ్యాంగం జీవించే హక్కు అందరికీ ఇచ్చిందని, ఎవరి ప్రాణం కూడా చట్ట విరుద్ధంగా తీసేయడం సరికాదన్నారు. ప్రస్తుతం దేశంలోనిరుద్యోగం, ఆకలి బాధలు, కల్తీ, అవినీతి, విద్యాను వ్యాపారంగా మార్చి దోచుకొంటున్నారని మండిపడ్డారు. లోపల ఉండాల్సిన వారు బయట ఉంటున్నారని, బయట ఉండాల్సిన వారు లోపల ఉంటున్నారని విమర్శించారు. ఎందుకంటే, కేంద్రంలో 72మంది కేంద్రమంత్రులుంటే 40 మందిపై క్రిమినల్ కేసులున్నాయని, వీరిలో 19 మందిపై కేసులు న్నా యన్నారు. దేశవ్యాప్తంగా 643 మంది ఎంఎల్ఎలలో 342 నుంది ఎంఎల్ఏ (47శాతం) లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇరువైపుల ప్రాణనష్టం జరగకుండాకేంద్రప్రభుత్వం సాయుధ బలగాలను ఉపసం హరించుకొని మావోయి స్టులను చర్చలకు పిలువాలని, అప్పుడే ప్రజాస్వా మిక వాతావరణం ఏర్పాటుకు అనుకూల ఏర్పడుతుందని శాంతి చర్చల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో న్యూ డెమోక్రసీ చలపతిరావు, శాంతి చర్చల కమిటీ అజయ్ బాల్నీ తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో సిబిఐ బృందం

### వామనరావు దంపతుల హత్య కేసులో దూకుడు పెంచిన దర్యాప్తు సంస్థ



**మంథని, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు నాగమణి దంపతుల హత్య కేసులో గురువారం సిబిఐ అధికారులు మంథనిలో పర్యటించి వివరాలు సేకరించారు. 2021 ఫిబ్రవరి 17న మంథని డివిజన్ రామగిరి మండలం కల్వచర్ల గ్రామ శివారులో నడిరోడ్డు పైన దారుణ హత్యకు గురైన న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు నాగమణి దంపతుల కేసుకు సంబంధించి తమకు న్యాయం జరగలేదని వామన్ రావు తండ్రి గట్టు కిషన్ రావు సుప్రీంకోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం సిబిఐ ద్వారా విచారణ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం సిబిఐ అధికారులు రామగుండం కమిషనరేట్ కు చేరుకొని సిపి కార్యాలయంలో న్యాయవాద దంపతుల హత్యకు సంబంధించిన కేసు వివరాలు , ఎఫ్ ఐ ఆర్ ను పరిశీలించారు. అనంతరం మంథని మండలం గుంజపడుగు గ్రామంలో వామన్ రావు ఇంటికి వెళ్లి తండ్రి కిషన్ రావు , సోదరుడు చంద్రశేఖర్ తో పాటు ఇతర కుటుంబ సభ్యుల వద్ద వివరాలు సేకరించారు. ఆలోచన అనంతరం మంథని కోర్టులో ఆరోజు వామన్ రావు దంపతులు ఎవరెవరితో మాట్లాడారు వారు కారు ఎక్కడ పార్కు చేశారు మొదలైన వివరాలను సేకరించారు. అక్కడి నుండి నేరుగా హత్యకు గురైన కల్వచర్ల గ్రామ శివారులోకి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సిబిఐ అధికారుల వెంట గోదావరిఖని ఏసిపి రమేష్ తో పాటు మంథని రామగిరి పోలీసులు ఉన్నారు. గట్టు వామన్ రావు దంపతుల హత్య కేసులో ఇంతవరకు ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి జైలు పంపగా ప్రస్తుతం నిందితులు బెయిల్‌పై బయట ఉన్నారు. ఇదిలా ఉండగా మంథని ప్రాంతానికి సిబిఐ అధికారులు వచ్చి గట్టు రామారావు దంపతుల హత్య వివరాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించడంతో మంథని ప్రాంతంలో మళ్లీ వామన్ రావు హత్య విషయం తెరపైకి వచ్చింది.

## ఘనంగా వర్ధమాన్ మహిళా కోఅర్బన్ బ్యాంక్ 36వ వార్షిక సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** వర్ధమాన్ (మహిళా) కోఆప్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 36వ వార్షిక జనరల్ బాడీ మీటింగ్ గురువారం రాంకోట్‌లోని ఈడెన్‌బాగ్‌లోని "కచ్చి భవన్"లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ మహేందర్ జైన్ గోలేచా మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ ఆర్థిక లావాదేవీలు రూ. 995 కోట్లకు దాటిందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 656.29 కోట్లు ఉన్నట్లుతెలిపారు. ఈ సిడి రేషియో (క్యాష్ డిపాజిట్స్)62.70 శాతం నమోదైనట్లు తెలిపారు. అంతే కాకుండా బ్యాంక్ సొంత నిధులు కూడా గణనీయంగా పెరిగిందని ఇది బ్యాంక్ ఆర్థిక స్థిరత్వాన్ని తెలియచేస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా బ్యాంక్ రిజర్వుబ్యాంక్ ఆదేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో బ్యాంక్ మూడు కొత్త శాఖలను ప్రారంభించిందని, ప్రస్తుత సంవత్సరంలో మూడు కొత్త శాఖలను తెరవడానికి బ్యాంకుకు అనుమతి లభించిందన్నారు. వినియోగదారులు మొబైల్ యాప్ ద్వారా రోజుకు మొత్తం రూ.20 లక్షల పరిమితితో రూ.5 లక్షల వరకు ఒకే లావాదేవీ చేయవచ్చు. ఒక కస్టమర్ రోజుకు 10 లావాదేవీలు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంక్ డైరక్టర్లు నిర్మలా డాగ, రాజకుమారి చోర్డియా, ఎస్‌బిఐఎస్ మణియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశామనికి ముందు బ్యాంక్ చైర్మన్ వార్షిక నివేదికను డైరెక్టర్లకు, సభ్యులకు చదివి వినిపించారు.

## వదంతులు నమ్మొద్దు.. నా రాజకీయ భవిష్యత్ నేనే చెబుతా: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నా అని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కొందరు గిట్టని వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఓ కార్యక్రమానికి వెళ్తూ చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి? ఇవాళ కూడా ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటేమాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారని ఆవేదన చెందారు.

## కవిత రాజీనామాపై త్వరలో నిర్ణయం

### పునరాలోచించాలని సూచించా: మండలి చైర్మన్ గుత్తా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 18:** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజీనామా వ్యవహారంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత కవిత భావోద్వేగంతో రాజీనామా చేసి ఉండవచ్చని, అందుకే పునరాలోచించుకోవాలని తాను సూచించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కారణంగానే ఆమె రాజీనామాపై నిర్ణయం తీసుకోవడంలో కొంత జాప్యం జరిగిందని పరోక్షంగా తెలిపారు. గురువాం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చేశారు. కవిత రాజీనామా అంశంపై స్పష్టత ఇచ్చారు. 'నా రాజీనామాను ఆమోదించాలని కవిత నాకు ఫోన్ చేశారు. అయితే, ఆ తర్వాత ఈ విషయం మళ్లీ నా దృష్టికి రాలేదు. పార్టీ నుంచి బహిష్కరించిన నేపథ్యంలో ఎమోషనల్‌గా రాజీనామా చేశారు కాబట్టి, మరోసారి ఆలోచించుకోవాలని నేను ఆమెకు చెప్పాను' అని గుత్తా వివరించారు. కవిత రాజీనామాపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి ఈ నెల 3వ తేదీన కవిత రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వెంటనే తన రాజీనామా లేఖను చైర్మన్ కార్యాలయానికి పంపడంతో పాటు, దానిని ఆమోదించాలని ఫోన్‌లో కూడా కోరారు. అయితే, రాజీనామా చేసి 15 రోజులు గడుస్తున్నా దానిపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. తాజాగా గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇదే సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి రాష్ట్రంలోని ఇతర అంశాలపైనా మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారని ప్రశంసించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వైద్య రంగానికి ప్రభుత్వం ఏటా దాదాపు రూ.1200 కోట్లను ఖర్చు చేస్తుందని, అలాగే ఆరోగ్యశ్రీ, సిఎంఆర్ఎఫ్ పథకాలపై మరోసారి సమీక్ష నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ మాదిరిగా రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లోని హాస్పిటల్స్‌ని బలోపేతం చేయాలని చెప్పారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌ను అభివృద్ధి చేసి ఆయా హాస్పిటల్స్‌లో పని చేసే డాక్టర్స్‌కి ప్రోత్సహకాలు ఇచ్చి మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

